ప్రజాపాలన అంటే.. అక్రమ నిర్బంధాలేనా..!

● కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
● ఎమ్మెల్యేతోపాటు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

దుండిగల్ : గృహ నిర్బంధంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 6 : ప్రజాపాలన పేరుతో రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, కార్పొరేటర్లను అక్రమంగా నిర్బంధించడం దేనికి సంకేతమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రశ్నించారు. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పర్యటన దృష్ట్యా.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతోపాటు కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ దళిత నాయకుడు బొట్టు విష్ణును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... వర్సిటీలో జరిగే అంబేద్కర్ వర్ధంతి వేడుకలకు.. ప్రొటోకాల్ ప్రకారం తనకు ఆహ్వానం పలకాల్సింది పోయి.. పోలీసులు గృహ నిర్బంధం చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు సమస్యలపై పోరాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన విధంగా గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు అండగా ఉండి పోరాడుతుందన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

దుండిగల్ : అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ ట్యాంక్‌బండ్ వద్ద నిరసన తెలపాలని భావించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు గృహ నిర్బంధం చేశారు. శుక్రవారం ఉదయమే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతోపాటు ఆయన సోదరుడు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను స్థానిక పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఎమ్మెల్సీ నివాసాన్ని చుట్టుముట్టారు. అదే విధంగా 9వ వార్డు కౌన్సిలర్ బండారి మహేందర్ యాదవ్‌తో పాటు ఆయన అనుచరులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాజులరామారం,జగద్గిరిగుట్ట డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్‌రాం రెడ్డి,రుద్ర అశోక్‌తో పాటు పలువురు కార్యకర్తలను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. ప్రజాపాలనలో పోలీస్‌కేసులు ఉండవని చెప్పిన సీఎం ఇపుడేమీ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న తమ పార్టీ నాయకులను నిర్బంధించడం దేనికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నిర్బంధకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారపార్టీ నేతలకు తలొగ్గి వ్యవహించే అధికారులు భవిష్యత్‌లో తగినమూల్యం చెల్లించక తప్పదన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో..

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వివేకానందనగర్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావును ఆయన నివాసంలో శుక్రవారం కూకట్‌పల్లి సీఐ ముత్తు హౌస్ అరెస్ట్ చేసారు. ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీశ్‌రావు తన నివాసం నుంచి పార్టీ శ్రేణులతో బయల్దేరకుండా పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రంగారావు మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని విమర్శించారు.

జగద్గిరిగుట్టలో...

జగద్గిరిగుట్ట :అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగుతున్నారన్న కారణంతో పలువురు జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ నేతలను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రుద్రఅశోక్, వేణుయాదవ్, బ్రహ్మానంద చారి, శశిధర్, బీఎస్ఆర్ నాని తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ల హౌస్ అరెస్ట్

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్‌బోయిన్‌పల్లి, ఫతేనగర్, బాలానగర్ డివిజన్ల కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, పండాల సతీశ్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డిని శుక్రవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. హౌస్ అరెస్ట్‌లకు భయపడమన్నారు. హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం బాధాకరం అన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం విచారకరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదని వారు దుయ్యబట్టారు.

అల్లాపూర్ కార్పొరేటర్ గృహ నిర్బంధం

అల్లాపూర్ : డివిజన్ కార్పొరేటర్ సబీహ బేగం దంపతులనును శుక్రవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్క పౌరుడికి ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులను గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమేనని మండిపడ్డారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గృహ నిర్బంధం

కుత్బుల్లాపూర్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు శుక్రవారం ట్యాంక్‌బండ్ 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనకు వెళ్తుండగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆయన నివాసంలో పేట్ బషీరాబాద్ పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో ప్రజల్లో ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తిని తగ్గించలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడే నిర్బంధం చేస్తూ ప్రజా పాలన అంటూ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ప్రజల చేతిలో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పక తప్పదని ఆయన హెచ్చరించారు.

అల్లాపూర్ : గృహ నిర్బంధంలో కార్పొరేటర్ సబీహబేగం దంపతులు

బాలానగర్ : ఫతేనగర్ కార్పొరేటర్ సతీశ్‌గౌడ్‌ను గృహ నిర్బంధం చేసిన సనత్‌నగర్ పోలీసులు

గృహ నిర్బంధంలో ఉన్న ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీశ్‌రావు, ఇతర నాయకులు

మియాపూర్ : మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావును హౌస్ అరెస్ట్ చేసిన కూకట్‌పల్లి సీఐ ముత్తు

కేపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ శ్రీనివాస్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలర్ మహేందర్‌యాదవ్,బీఆర్ఎస్ శ్రేణులు

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

న్యూఇయర్ వేడుకలకు అనుమతులు తప్పనిసరి

● ఈవెంట్స్ నిర్వాహకులకు మాదాపూర్ డీసీపీ వినీత్ సూచన

గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, ఈవెంట్ల నిర్వాహకులు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 6 : కొత్త సంవత్సర వేడుకలకు అనుమతులు తప్పనిసరని, పోలీస్ నిబంధనలకు లోబడి ఈవెంట్స్ నిర్వాహకులు అనుమతి తీసుకొని వేడుకలు జరుపుకోవాలని మాదాపూర్ డీసీపీ వినీత్ సూచించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో మాదాపూర్ జోన్ పరిధిలోని ఈవెంట్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 15వ లోపు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలన్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, పరిమితితో కూడిన పాస్‌లను జారీచేయాలని, సరిపడా పార్కింగ్ సదుపాయాన్ని కలిగి ఉండాలని, పరిసర ప్రాంతాల్లో శబ్దకాలుష్యం లేకుండా, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, గచ్చిబౌలి సీఐ హబీబ్‌ఉల్లా ఖాన్, రాయదుర్గం సీఐ వెంకన్నతోపాటు పోలీస్ అధికారులు, పలువురు రెస్టారెంట్ల, ఈవెంట్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

కొంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం..

కొంపల్లి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 6 : ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో కొంపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం కమిషనర్ కె.శ్రీహరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 18 వార్డుల్లో మౌలిక సదుపాయాలు, భవిష్యత్ నిర్మాణాలు, అంతర్గత సమస్యల పరిష్కారానికి రూ.5 కోట్ల 45 లక్షల నిధులు కేటాయిస్తున్న ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలి ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రత్లావత్ గంగయ్యనాయక్, మేనేజర్ ఎస్.వెంకటేశం, కౌన్సిలర్లు, సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్స్ పంపిణీ

బాలానగర్, డిసెంబర్ 6 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కొత్త యూనిఫామ్స్‌ను శుక్రవారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ పంపిణీ చేశారు. నేతాజీ కాలనీ, శివశంకర్‌నగర్ కాలనీ, జింకలవాడలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి వచ్చిన కొత్త యూనిఫామ్స్, బుక్స్ రాక్, రౌండ్ టేబుల్, రెక్టాంగిల్ టేబుల్, ప్లేమ్యాట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి,అంగన్‌వాడీ టీచర్స్ స్రవంతి, రేణుక, బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, బాగయ్య, రాజు, సురేశ్, ఆనంద్‌గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

● బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 6 : భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం గొప్పదని, రాజ్యాంగాన్ని కాపాడుకుంటే.. అది మనల్ని కాపాడుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలకు ఉప ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి కె.రామకృష్ణారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్యార్థులు తమ మేధస్సును సమసమాజ స్థాపనకు ఉపయోగించాలన్నారు. రాజ్యాంగం రాజరిక వ్యవస్థల నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిందని, రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. రేపటి భవిష్యత్‌కు విద్యార్థులు పునాదులని, తమ లక్ష్యాలను సాధించడానికి ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవద్దన్నారు. విద్యతోనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. బీఆర్ అంబేద్కర్ ఆలోచనలను కేవలం అణగారిన వర్గాలకు మాత్రమే పరిమితం చేశారని, ఆ మహనీయుడు సమాజంలోని ప్రతి ఒక్కరి హక్కుల కోసం పోరాడాడని, అందరికి సమాన హక్కులను కల్పించాడన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మారెడ్డి, వర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ మాధవి కుమారి పాల్గొన్నారు. వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో మార్పులు సరికాదు'

బాలానగర్, డిసెంబర్ 6 : రాష్ట్ర సచివాలయం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం తయారు చేయించిన తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో మార్పులు చేయడాన్ని తెలంగాణ సమాజం సహించదని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అంటేనే ప్రకృతికి పుట్టినిల్లు.. అలాంటి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుండా విగ్రహం తయారు చేయడం శోచనీయమన్నారు. తెలంగాణ విలువలు తెలియని వారు విగ్రహం రూపొందించారని ఆయన విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రచారకర్తగా చిత్రీకరించడం బాధాకరం అన్నారు.

కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్‌గా గంగాధర్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 6 : కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్‌గా బి.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన హరికృష్ణయ్య నవంబర్ 30న పదవీ విరమణ చేశారు. దాంతో చార్మినార్ జోన్‌లో డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మున్సిపల్ గ్రేడ్-2 ఆఫీసర్ బి.గంగాధర్‌ను ఉప కమిషనర్‌గా నియమిస్తూ.. జీహెచ్‌ఎంసీ అడిషినల్ కమిషనర్(అడ్మిన్) ఈ నెల 5న ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 6 : ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ రంగానగర్ కాలనీకి చెందిన గోరాజన సంతోష్(34) కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల తనకు తెలిసిన వారి వద్ద అప్పు తీసుకొని తిరిగి చెల్లించేందుకు ఇబ్బందులకు గురయ్యాడు. మనస్తాపం చెంది ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన మృతుడి భార్య రూప చూసి హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ సేవలు స్ఫూర్తిదాయకం

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
● అంతటా.. రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

కూకట్‌పల్లి అంబేద్కర్ వై జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, దళిత ఐక్యవేదిక నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 6 : బడుగు, బలహీన వర్గాల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి వై జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నేతలు పాల్గొన్నారు.

* కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో దళిత ఐక్యవేదిక నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి వేడుకలకల్లో పెద్దిరాజు, కట్టా నర్సింగరావు, పీఎల్ ప్రసాద్, కోదండరామయ్య, శేఖర్‌రెడ్డి, కృష్ణనాయక్, చిన్నా, సాంబశివరావు, రమాదేవి, కన్నాలత, భారతిలు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీ 4వ ఫేజ్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

* బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్యపాగ శ్రీనివాస్, అనిల్‌కుమార్,వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, రమణ, జశ్వంత్, సుభాశ్‌గౌడ్, దుర్గరాజ్, రవీందర్, వెంకట్, శ్రీనివాస్ ఉన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

బాలానగర్ : భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లిలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హస్మత్‌పేట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, నర్సింగ్, మిరాజ్, శ్రీను, దేవేందర్, సత్యనారాయణ, లలిత, ఉదయరాణి, సరోజ, పోచయ్య, ఖదిర్, గణేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో...

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. డిపో మేనేజర్ డి.హరి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా హెచ్ఏఎల్‌లో ఎస్సీ. ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జీఎం రామ్మోహన్‌రావు, ఎస్ఎల్ఆర్‌డీసీ జీఎం మజుందార్‌లతో పలు యూనియన్లకు చెందిన నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడ అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య స్థానిక నేతలతో కలిసి అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

మియాపూర్ : ఆర్పీ కాలనీలో అంబేద్కర్‌కు నివాళులర్పించిన కార్పొరేటర్ రోజాదేవి

కేపీహెచ్‌బీ కాలనీ : వివేక్‌నగర్‌లో..

బాలానగర్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, బీఆర్ఎస్ నాయకులు

దుండిగల్ : నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప సముదాయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు రంగరాయప్రసాద్ తదితరులు

కొండాపూర్ : సిద్దిక్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

మూసాపేట డివిజన్‌లో..

మూసాపేట : డివిజన్ పరిధి అంబేద్కర్‌నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు పాతపల్లి కృష్ణ,డాకయ్య, శివశంకర్, నర్సింగ్ రావు, సురేశ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ పరిధిలో..

మియాపూర్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఆర్‌పీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయ కులు మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు, కొండల్‌రావు, బాబు, రమేశ్, విద్యాసాగర్, జగన్, ప్రవీణ్, వెంకటేశ్వర్ రావు, కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ మహంకాళీనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు పార్టీ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. రాములుగౌడ్, కర్ణాటక రాజు, సాయిగౌడ్, నజీర్, రాజు, చంద్రశేఖర్ గౌడ్, వెంకటేశ్, రవి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో..

మియాపూర్ డివిజన్ నడిగడ్డ తండాలో ఎంసీపీఐయూ నేత ఇస్లావత్ దశరథ్ నాయక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దుండిగల్ పరిధిలో..

దుండిగల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మూసాపేట్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్


దుండిగల్ : సూరారం అంబేద్కర్ భవన్‌లో నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

దండముడిలోని తన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్ఎస్ నాయకులు

ప్రజాప్రతినిధుల గృహనిర్బంధం రాజ్యాంగ విరుద్ధం

● అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై పోరాడే ప్రజాప్రతినిధులను గృహనిర్బంధం చేయడం రాజ్యాంగ విరుద్ధమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. శుక్రవారం దండముడిలోని తన నివాసంలో ఎమ్మెల్యేను పేట్ బషీరాబాద్ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ ఏర్పాటైందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదేవిధంగా కొంపల్లి చౌరస్తాలో మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాజీ వార్డు సభ్యులు సన్న శ్రీనివాస్‌యాదవ్, జి.రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.272 of 2024

Between
SHIRIRAM RAGHAVENDRA CHITS
BR. Mahabubnagar ... **Disputant**
And
Babhiya Nayak and others ... **Opponents**

To
NOTICE

2. K. Kishan S/o K. Bhenikiya, aged 48 years, Occ: LFI, Head Master, O/o M.P.P.S Anjaiah Nagar (V), Quthbullapur (M), Medchal, Ranga Reddy (D), R/o H.No. Plot No.1347-FG-I, Apparment, Pragathi Nagar, Opp: JNTU, Hydrabad town & Dist.
4. P. Ramesh S/o P.Pandu, aged : 37 years, Occ: Police Constable No.5904, O/o Police Station at Jagathgirigutta, Cybarabad, Hydrabad town & Dist, R/o H.No.1-36/1/12/1/7, Vemana Colony, Chanda nagar, Ranga Reddy Town & Dist., ...*Opponents 1 to 5*

Claim for Recovery of Rs. 7,79,550/- (Rupees Seven Lakhs seventy nine thousand five hundred fifty only)

Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on **28-12-2024** at **11-30A.M.** for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.

"By the order of the Arbitrator"
Mahabubnagar

S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415